# బావా మరదళ్ళు

ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి

''బావా బావా పన్నీరు. బావను పట్టుకు తన్నేరు'' అంటూ పాత పాట పాడుతూ వచ్చింది స్వప్న.

టేబుల్ దగ్గర కూర్చుని లెక్కలు చేస్తున్న రాజా ముఖం ఎర్రగా చేసుకుని కూర్చున్నాడు.

రాజాని చూసిన స్వప్న మరింత రెచ్చిపోయి హుషారుగా గట్టిగా అందుకుంది ''ఎదురుతెన్నులు చూసెనే బావకై'' అంటూ మొదలెట్టింది.

పెదవి కొరుకుతూ పట్టించుకోనట్టు నటిస్తూ తీవ్రంగా కాలిక్యులేటర్‌తో లెక్కలు చేసుకోసాగాడు. పట్టించుకోనట్టు వున్నాడు అంటే మరింత రెచ్చిపోతుంది.

''నాన్నా...నాన్నా...'' గట్టిగా పిలిచింది.

''ఏమిటమ్మా?'' అంటూ ఎంతో గారంగా, ప్రేమగా అంటూ వచ్చాడు తండ్రి.

''పూర్వం మీరు లెక్కలు ఎలా చేసేవారు?'' అంది.

''ఎలా ఏమిటమ్మా? అన్నీ నోటితోనే. నోటి లెక్కలు, ఎక్కాలు బట్టీపడుతూ'' అన్నాడు.

''కానీ కాలం చూశావా ఎలా మారిపోయిందో. రెండు రెండు కలిపితే ఎంత అనేది కూడా కాలిక్యులేటర్ మీదే చేయడం. అలా చేస్తే మెదడు మందగిస్తుంది అంటారు కదా నాన్నా!'' అంది.

''అవునమ్మా. అస్తమానం టీవీలు చూడడం, కాలిక్యులేటర్లు ఉపయోగించడం, కంప్యూటర్ వాడడం దీనివల్ల సృజనాత్మకత దెబ్బ తింటుంది అంటున్నారు. మెదడు డల్ అవుతుంది'' అన్నాడు రంగారావు.

''కానీ అవన్నీ మెదడు వున్నవాళ్ళ సంగతి కదా నాన్నా?'' అంది.

''అవునమ్మా. కానీ నీ మెదడుకేం లోటు? చక్కని తెలివితేటలు?'' అన్నాడు తండ్రి.

అంతవరకూ ఉక్రోషంగా వింటున్న వింటున్న రాజా ఫక్కున నవ్వి వెళ్లిపోయాడు.

''పో నాన్నా. నా ప్లానంతా దెబ్బ తీసావు. నేను బావని ఏడిపించడానికి ప్లాన్ వేస్తే నాకే రివర్సు అయింది. అలా చేశావు'' అంది బుంగమూతితో.

అప్పటికి విషయం అర్థమైంది రంగారావుకి.

''ఓహో బావా మరదళ్ళ సరసాలా?'' అని నవ్వుకుంటూ వెళ్లిపోయాడు. రాజాకి చిన్నప్పుడే తండ్రి పోయాడు. బోలెడంత ఆస్తి. కానీ మగదిక్కులేక అన్నగారి వద్ద ఉంటోంది చెల్లెలు యశోద.

రాజా స్వప్నలకి ఇద్దరికీ క్షణం పడదు.

తల్లి వడ్డిస్తుంటే భోంచేస్తున్నాడు రాజా. అతను తింటూండడం చూసి ఆకలి లేకపోయినా వచ్చి కూర్చుంది స్వప్న.

''అత్తయ్యా! నాక్కూడా పెట్టేయ్'' అంది.

''అమ్మా! నాకు వంటరిగా తినడమే ఇష్టం. తరువాత తినమను'' అన్నాడు కోపంగా.

''అత్తయ్యా! నాకు ఆకలి మండిపోతోంది. వంటరిగా తినాలి అనుకునేవాళ్ళని నేను తిన్నాక వచ్చి తినమను. ఆఫ్‌కోర్స్! నాకు మాత్రం ఆ అలవాటు లేదనుకో. పదిమంది ఉండాలి అనుకుంటాను'' అంది కొంటెగా.

యశోదమ్మ స్వప్నకి కూడా కంచం పెట్టింది ''ఏమిట్రా ఆ మాటలు?'' అంటూ.

కోపంగా వెళ్లిపోబోయిన రాజా ఆగిపోయాడు కొత్త ఆలోచన వచ్చింది.

''అమ్మా! ఆడపిల్లలు కూడా పెట్టుకు తినలేరా? చేతులు లేవా?'' అన్నాడు.

''అత్తయ్యా! చేతులుండడమే అన్నం పెట్టుకు తినడానికి కావలసిన అర్హతైతే అది మగవాళ్ళకి కూడా వుంటాయి'' అంది అమాయకత్వం నటిస్తూ ''ప్రేమగా పెట్టే చెయ్యి ముఖ్యం. అది కావాలి అవునా?'' అంది.

యశోదమ్మ మనసులో నవ్వుకుంది. ఇద్దరికీ క్షణం పడదు. పెళ్లి చేస్తే ఎలా ఉంటారో? అందుకే పెళ్ళైనంతవరకూ ఇద్దరి మధ్యా సామరస్యం కుదర్చడానికి, ఒకచోట ఉంచడానికి ప్రయత్నిస్తుంది.

''చూడమ్మా! బావ ఏదైనా అంటే వెంటనే అలా ఎదురు చెప్పకూడదు. నీకంటే పెద్దవాడుకదా'' అంది అనునయంగా.

''సరే అత్తయ్యా! కాసేపున్నాక ఎదురు చెబుతాలే'' అని నవ్వుతూ భోజనం ప్రారంభించింది. యశోదమ్మకి నవ్వు వచ్చింది. కానీ రాజాని చూసి ఆపుకుంది.

ఏదో అనబోయాడు. ఇంతలో రాజా ఫ్రెండ్ ఈశ్వర్ వచ్చాడు. అతను ఎప్పుడూ భోజనాల టైమ్‌కే వస్తాడని, అతడి పేరు ఈశ్వర్ కాదు, ఈటర్ అంటుంది స్వప్న.

తన ఫ్రెండ్‌ని విమర్శించడం రాజాకి ఇష్టం ఉండదు. అయినా స్వప్న వింటేగా! ఎప్పటిలానే అతనినీ అన్నం తినమంది యశోదమ్మ.

ఈశ్వర్ వెంటనే భోజనానికి కూర్చున్నాడు. అతను రాజాకి బెస్ట్ ఫ్రెండ్. రాజాకి కొత్త ఆలోచన వచ్చింది.

''ఈశ్వర్! మా అమ్మ కష్టపడడం చూడలేకపోతున్నాను. మంచి పిల్ల ఉంటే చూడు. పెళ్లి చేసుకుంటాను'' అన్నాడు.

''మంచి పిల్ల అంటే ఎలాంటి పిల్ల?'' అడిగాడు ఈశ్వర్ అన్నం కలుపుతూ కొంచెం ఆశ్చర్యంగా చూస్తూ.

స్వప్న అందుకుంది.

''మంచి పిల్ల అంటే నీకు తెలియదా ఈశ్వర్? ధనవతి, గుణవతి, శీలవతి, గర్భవతి'' అంటూ ఫక్కున నవ్వింది. ఈశ్వర్ కూడా నవ్వాడు.

''నువ్వు నోరు మూసుకో. ఇందులో నువ్వు కల్పించుకోకు. నువ్వు చూడు ఈశ్వర్'' అన్నాడు రాజా కోపంగా.

''సరే సరే ఇంతకూ ఎలాంటి అమ్మాయి కావాలి?'' అన్నాడు.

''అందమైనదీ, చదువుకున్నదీ తెలివైన ఉద్యోగస్తురాలు కూడా అయి ఉండాలి'' చెబుతున్నాడు రాజా.

''ఈశ్వర్ నాకో సందేహం? అవన్నీ వున్న పిల్ల మీ ఫ్రెండ్‌ని ఎందుకు చేసుకుంటుంది?'' అంది స్వప్న అమాయకంగా.

''ఏమో చెప్పలేం?'' అన్నాడు ఈశ్వర్ ''ఎందుకు చేసుకోకూడదు?''

''ఏమో చెప్పలేం. నిజమే విధి వైపరీత్యం ఎప్పుడెలా వుంటుందో? ఎవరికెవరో?'' అంది చెయ్యి కడుక్కోవడానికి లేస్తూ పకపకా నవ్వుతూ స్వప్న.

వద్దన్నా శృతి కలపకుండా ఉండలేకపోయారు యశోదమ్మ, ఈశ్వర్.

ఉక్రోషంగా తనూ లేచిపోయాడు రాజా.

''పూర్తిగా తినరా?'' అంది యశోదమ్మ కంగారుగా.

''చాల్లే అత్తయ్యా! నాకంటే ముందర మొదలె ట్టాడు. భోజనం పూర్తయ్యే వుంటుంది. అందుకే లేచాడు'' అంది స్వప్న.

ఈశ్వర్ కూడా నవ్వుతూ లేచాడు. రాజా వినిపించు కోనట్లు వెళ్లిపోయాడు.

• • •

''యశోదా! మాఘమాసం వచ్చింది మరి. వాడికి ఉద్యోగం వచ్చింది. స్థిరపడ్డాడు. దాని చదువు ఈ పరీ క్షలతో సరి. మరి వీళ్ల పెళ్లి సంగతేమిటి?'' అన్నాడు రంగారావు.

పరీక్షలకి చదువుకుంటున్న స్వప్న శ్రద్ధగా వినసా గింది.

''అదే నేనూ అనుకుంటున్నానన్నయ్యా? కానీ వీళ్లిద్దరూ ఎప్పుడూ ఉప్పునిప్పులా ఉంటున్నారు. నాకు ఏం చేయాలో తేచడంలేదు'' అంది యశో దమ్మ.

ఇంట్లోకి అడుగుపెట్టబోతున్న రాజా ఉలిక్కిప డ్డాడు.

''నీకు ఒక్కడే. నాకూ ఒక్కత్తే. పరా యిచేట్లి ఇస్తే ఎలా వుంటారో? వీళ్లి ద్దరినీ చూస్తే ఇలా వున్నారు'' అన్నాడు రంగారావు.

''చిన్నతనం'' తల్లి ఏదో అనబోయింది.

''ఏమిటీ చిన్నతనం? ఇద్ద రికీ పెళ్లి వయస్సు వచ్చింది. రేపు పెళ్లయినా ఇలాగే వుంటే ఎవ రికీ శాంతి ఉండదు. ఇద్దరికీ మంచి సంబంధాలు చూసి బయట చేసేద్దాం. ఏమంటావు?'' అన్నాడు తండ్రి.

''అలాగే'' అంది యశోదమ్మ.

''మళ్లీ మనమధ్య ఎలాంటి అపా ర్థాలు ఉండకూడదని ముందే వివ రంగా చెబుతున్నాను'' అన్నాడు రంగారావు.

''నిజమేలే'' అంది యశోదమ్మ.

''ఏమిటీ మా కిష్టంలేదని ఎవరన్నారు? సరదాగా అనుకుంటే ఇష్టం లేనట్టేనా? నేను స్వప్ననే చేసుకుం టాను'' కోపంగా లోపలికి వచ్చిన రాజా అన్నాడు.

అదే టైమ్‌కి హాలులోకి వచ్చిన స్వప్న కూడా అంతే కోపంగా అంది ''అవును. బావామరదళ్ళు అంటే సరసాలు ఆడుకోరా. అంటే ఇష్టం లేనట్టేనా?'' అంది.

''అలాగా. మాకేం తెలుసునమ్మా? నేను మీ అమ్మ బావామరదళ్ళం కాము. అలాగే మీ అత్తయ్య, మామయ్య కూడా కాదు. మాకేం తెలుసు? ఏం యశోదా?'' అన్నాడు నవ్వుతూ తండ్రి.

''అవునవును'' అంది యశోద కూడా నవ్వుతూ.

''ఇంతకీ మీ ఇద్దరికీ పెళ్లి చేసుకోవడానికి అభ్యం తరం లేదంటారు అవునా? మళ్లీ మమ్మల్నేమీ అనకూ డదు. ఈ పెళ్లి ఇష్టమేనా?'' అంది యశోద.

సిగ్గుగా తలూపింది స్వప్న వెంటనే. లేకపోతే మళ్ళీ ఎక్కడ వేరే అభిప్రాయానికి వెడతారో అనుకుంది.

''నువ్వురా'' అన్నాడు తండ్రి.



''ఎన్నిసార్లు చెప్పాలి?'' స్వప్న అభిప్రాయమే నా అభిప్రాయం'' అన్నాడు రాజా.

''అలాగా. ఇంకేం యశోదా! వదినా మరదళ్ళు పెళ్లి పనుల్లో పడండి. మీ మన స్సుల్లో సందేహం తీరిందిగా?'' అన్నాడు రంగా రావు.

ఇంతలో ఈశ్వర్ వచ్చాడు.

''రావయ్యా రా. నీ ప్లాన్ ఫలిం చింది.''

''ఒప్పుకు న్నారా?'' అన్నాడు ఆత్రు తగా ఈశ్వర్.

''ఒప్పుకోవడమా? వాళ్లిద్దరికీ పెళ్లి చేయక పోతే మామీద యుద్ధం చేసేలా వున్నారు'' అన్నాడు రంగారావు.

''ప్లానేమిటి?'' అన్నాడు రాజా.

''అదే మీరిద్దరూ ఎప్పుడూ పిల్లి ఎలుకలాగా వుంటుంటే పెళ్లి చెయ్యాలా వద్దా అనే సందేహంలో ఉన్నారు మీవాళ్లు. దానికి తోడు నువ్వు వేరే సంబంధం చూడమనడంతో ఆ సందేహం ఎక్కువయింది. మీరు వింటుండగా ఆ ప్రసక్తి తెచ్చి మీకిద్దరికీ పెళ్లి చేయరు అనే భావం కలిగించమని చెప్పాను. నిజంగా ఇష్టం లేకపోతే ఊరుకుంటారు. లేకుంటే అభ్యంతరం చెబు తారు అన్నాను. అలాగే జరిగింది.''

''ఓరి మిత్రద్రోహి. ఫ్రెండ్‌వి నాకు, సలహాలు వాళ్ళ కీనా?'' అన్నాడు కోపం నటిస్తూ రాజా.

''మరి. ఎప్పుడొచ్చినా అన్నం పెట్టి ఆదరించేది అత్తయ్య. సలహా వాళ్ళకి కాక ఎవరికి ఇస్తాడు బావా?'' అంది స్వప్న చిరుకోపంతో.

''నిజమే మరి. అసలే ఈటర్‌ని కదా. అత్తయ్య పార్టీ వదిలేస్తే ఎలా? అత్తయ్య వంట రుచి మళ్ళీ ఎక్కడా రాదు'' అన్నాడు భోజనప్రియు డైన ఈశ్వర్ నవ్వుతూ.

తను పెట్టిన నిక్‌నేమ్ అతనికి తెలిసినందుకు స్వప్న మొహం ఎర్రబ డింది. అయినా నవ్వేసింది. ఆమె నవ్వుతో అందరూ శృతి కలిపారు.

★